RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి : 13 సంచిక : 300 | ఆదివారం 12 ఏప్రిల్ 2026 | ఎడిటర్ : బత్తు లక్ష్మీనారాయణ, | పేజీలు : 6 వెల : రూ. 5.00

Hyderabad, Vijayawada, Vishakapatnam Tirupathi, Ananthapuram,Guntur,Nellor,Ongole,kadapa, Medak, Sangareddy, Siddipet, Nalagonda, Karimnagar,

## పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లలో సుస్థిర,సుదీర్ఘ శాంతి కొనసాగాలి

ప్రపంచ శాంతికి ఎదురయ్యే సవాళ్ల పరిష్కారానికి కృషి చేయాలి: ప్రధాని మోదీ పిలుపు

అంతర్జాతీయ సంస్థలకు ప్రధాని మోదీ సూచన

ఆస్ట్రియా ఛాన్సెలర్‌తో కలిసి ప్రెస్ మీట్‌లో పాల్గొన్న మోదీ



అంతర్జాతీయ సంస్థలు ప్రపంచశాంతికి ఎదురయ్యే సవాళ్ల పరిష్కారానికి కృషి చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచించారు. పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లలో సుస్థిర, సుదీర్ఘ శాంతి కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఆస్ట్రియా ఛాన్సెలర్ క్రిస్టియన్ స్టాకర్‌తో కలిసి ప్రధాని మోదీ ప్రెస్‌మీట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, యుద్ధ క్షేత్రాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావం ప్రపంచ దేశాలపై పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

కొన్ని దేశాల యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు కనిపిస్తున్నాయని అన్నారు. ఈ యుద్ధం ప్రభావం ప్రజల జీవన విధానంపై పడుతోందని అన్నారు. ఉక్రెయిన్ లేదా పశ్చిమాసియా ఏదైనా సమస్య శాశ్వతంగా పరిష్కారమై, శాంతి, సుస్థిరత కావాలని కోరుకుంటున్నామని పేర్కొన్నారు. సవాళ్లను ఎదుర్కోవడానికి సరికొత్త సంస్కరణలు చేపట్టవలసి ఉందని పిలుపునిచ్చారు. ఉగ్రవాదులను తుదముట్టించడం కూడా అవసరమని అన్నారు.ఆస్ట్రియా ఛాన్సెలర్ రాకతో దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత భారత్‌లో వాణిజ్య పెట్టుబడుల రంగంలో నూతనోత్సాహం మొదలైందని అన్నారు. భారత్-ఈయూ మధ్య కొత్త ఒప్పందాలతో సువర్ణాధ్యాయం ప్రారంభం కానుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు.

## ఉత్తర, దక్షిణ రాష్ట్రాలనే తేడా లేకుండా

# న్యాయం చేస్తాం

- మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్‌లో వివక్ష ఉండదని ప్రధాని హామీ

- ఈ అంశంపై రాజకీయం చేయవద్దని విపక్షాలకు సూచన

-మహిళా రిజర్వేషన్ల క్రెడిట్ మీరే తీసుకోవచ్చని విపక్షాలకు ఆఫర్

-2029 నాటికి కోటాను అమలు చేయకపోతే మహిళలను ఒప్పించలేమని వ్యాఖ్య

మహిళా రిజర్వేషన్ల అమలుకు ముందు చేపట్టే నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) విషయంలో ఎలాంటి వివక్షకు, అన్యాయానికి తావుండదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ విషయంలో తాను "గ్యారెంటీ", "ప్రామిస్" వంటి పదాలను ఉపయోగించడానికి సిద్ధంగా ఉన్నానని, ఉత్తర, దక్షిణ రాష్ట్రాలనే తేడా లేకుండా ఈ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని ఆయన భరోసా ఇచ్చారు.గురువారం లోక్‌సభలో 'రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026'పై జరిగిన చర్చలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళా రిజర్వేషన్ల అంశాన్ని రాజకీయాలకు అతీతంగా చూడాలని పిలుపునిచ్చారు. "ఈ బిల్లు ఘనతను మీరే తీసుకోండి. మీకు నచ్చిన వారి ఫొటోలతో నేను




ప్రకటనలు ఇవ్వడానికైనా సిద్ధం. ఈ విషయంలో మీకు 'బ్లాంక్ చెక్' ఇస్తున్నా" అని విపక్షాలను ఉద్దేశించి అన్నారు.

## డీలిమిటేషన్‌పై ప్రధాని భరోసా

హర్షం వ్యక్తం చేసిన నారా లోకేశ్

రాష్ట్రాల సీట్ల నిష్పత్తిలో మార్పు ఉండబోదన్న మోదీ

దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందుతున్న

సమయంలో ప్రధాని హామీ ఎంతో కీలకమన్న లోకేశ్

ఎన్డీయే సమాఖ్య స్ఫూర్తికి కట్టుబడి ఉంటుందని వ్యాఖ్య




## ఉన్నత విద్యలో ఫేస్ అటెండెన్స్‌పై మంత్రి లోకేష్ సమీక్ష

వచ్చే విద్యా సంవత్సరం నుంచి పకడ్బందీగా అమలుకు ఆదేశం

ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలన్నింటికీ వర్తించనున్న కొత్త విధానం

పారదర్శకత, నాణ్యమైన బోధనే లక్ష్యమన్న మంత్రి




## తెలంగాణ సమాజానికి తేజస్వీ సూర్య క్షమాపణలు చెప్పాలి: కేటీఆర్

పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై బీజేపీ నాయకులు మరోసారి తమ ద్వేషాన్ని వెళ్లగక్కారని, ఆ పార్టీ నేతలకు తెలంగాణ అస్తిత్వంపై ఏమాత్రం గౌరవంలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటాన్ని భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి అహంకార పూరిత, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.బీజేపీ నాయకులు పదేపదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమర వీరుల త్యాగాలను అవమానించడం అలవాటుగా మార్చుకున్నారని మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మొదలు ఈరోజు ఎంపీ తేజస్వీ సూర్య వరకు ప్రతి ఒక్కరు తెలంగాణ వ్యతిరేకతను పదేపదే చాటుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటుపై విషం కక్కుతూ బీజేపీ చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ సమాజం గుర్తు పెట్టుకుంటుందన్నారు.

తెలంగాణ రాష్ట్రం అనేది ఎవరి దయాదాక్షిణ్యాల వల్లనో, ఎవరి భిక్ష వల్లనో ఏర్పడలేదని అన్నారు. దశాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ పోరాటం, వేలాదిమంది యువకుల బలిదానాల ఫలితంగా ఈ గడ్డ విముక్తి పొందిందని గుర్తు చేశారు. అస్తిత్వం కోసం ప్రజలు చేసిన ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాన్ని దేశ విభజన లాంటి విషాదకర సంఘటనలతో పోల్చడం ద్వారా బీజేపీ తన కుసంస్కారాన్ని బయటపెట్టుకుందని విమర్శించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని ఆయన హెచ్చరించారు.

పార్లమెంటు సాక్షిగా తోటి ఎంపీ తెలంగాణపై విషం చిమ్ముతున్నా, అక్కడే ఉన్న ఎనిమిది మంది రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అత్యంత సిగ్గుచేటని దుయ్యబట్టారు. కనీసం తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ఎంపీలు కూడా బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలను ఖండించకుండా మౌనంగా ఉండడం దారుణమని అన్నారు. తమ కళ్ల ముందే తెలంగాణను అవమానిస్తున్నా అడ్డుకోలేకపోయిన వీరు, ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తున్న ఈ ఎంపీల వైఖరిని తెలంగాణ సమాజం గమనిస్తోందన్నారు. తెలంగాణను కించపరిచిన తేజస్వీ సూర్య తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, తెలంగాణ



ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలకు బీజేపీ పార్టీ కూడా తెలంగాణ ప్రజలకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే తేజస్వీ సూర్య వ్యాఖ్యలే బీజేపీ అధికారిక విధానంగా భావించాల్సి వస్తుందని కేటీఆర్ హెచ్చరించారు.

## రాజ్యసభ సభ్యుడిగా వేం నరేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం

తనపై నమ్మకంతో కాంగ్రెస్ అవకాశం ఇచ్చిందన్న నరేందర్ రెడ్డి

తెలంగాణ హక్కులపై సభలో పోరాటం చేస్తానని వెల్లడి

ప్రమాణ స్వీకారం చేసిన కొత్తగా ఎన్నికైన సభ్యులు



తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నాయకుడు వేం నరేందర్ రెడ్డి ఈరోజు రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల పలువురు నేతలు రాజ్యసభకు ఎన్నికైన విషయం తెలిసిందే. కొత్తగా ఎన్నికైన సభ్యులు ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం, వేం నరేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, తన మీద నమ్మకంతో రాజ్యసభ ఎంపీగా అవకాశం ఇచ్చినందుకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి ధన్యవాదాలు తెలిపారు.తెలంగాణ ప్రజలు, సమస్యలు, రాష్ట్ర హక్కులు, రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి పార్లమెంటులో పోరాటం చేస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల వికాసం, అభివృద్ధి కోసం శాయశక్తులా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, తెలంగాణ నుంచి ఎన్నికైన మరో కాంగ్రెస్ నాయకుడు అభిషేక్ మను సింఘ్వీ తదితరులు కూడా ఇవాళ ప్రమాణ స్వీకారం చేశారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
శుక్రవారం
17 ఏప్రిల్ 2026

## ఉత్తర, దక్షిణ రాష్ట్రాలనే తేడా లేకుండా

# న్యాయం చేస్తాం

ఈ బిల్లు దేశ రాజకీయాల దిశ, దశను మార్చే శక్తిమంతమైనదని ప్రధాని అభిప్రాయపడ్డారు. దేశ జనాభాలో సగభాగమైన మహిళలు విధాన నిర్ణయాల్లో పాలుపంచుకోవడం ద్వారా 'వికసిత్ భారత్ ఏ2047' లక్ష్యాన్ని చేరుకోవడం సులభమవుతుందని పేర్కొన్నారు. 2023లోనే 'నారీ శక్తి వందన్ అధినియం'ను ఏకాభిప్రాయంతో ఆమోదించామని గుర్తుచేశారు. "2029 నాటికి మహిళా కోటాను అమలు చేయడంలో విఫలమైతే, మన చిత్తశుద్ధిని మహిళలు నమ్మరు. దశాబ్దాలుగా వారికి నిరాకరించిన హక్కులను అందించే గొప్ప అవకాశం ఇప్పుడు మనకు లభించింది" అని మోదీ అన్నారు.గ్రామ పంచాయతీల నుంచి పట్టణ స్థానిక సంస్థల వరకు ఇప్పటికే వేల సంఖ్యలో మహిళలు నాయకత్వ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని, ఇప్పుడు వారిని జాతీయ స్థాయిలో విధాన నిర్ణయాల్లో భాగస్వాములను చేయాల్సిన సమయం వచ్చిందని ప్రధాని తెలిపారు. అంతకుముందు, ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టడాన్ని లోక్‌సభ ఆమోదించింది. విపక్షాలు రికార్డెడ్ ఓటింగ్ కోసం పట్టుబట్టడంతో, డివిజన్ ప్రక్రియ ద్వారా దీనికి ఆమోదం లభించింది

## డీలిమిటేషన్‌పై ప్రధాని భరోసా:

నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదని, పార్లమెంట్‌లో రాష్ట్రాల సీట్ల నిష్పత్తిలో మార్పు ఉండబోదని ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన హామీపై ఏపీ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని చేసిన ఈ ప్రకటన దక్షిణాది రాష్ట్రాలకు పెద్ద ఊరటనిస్తుందని ఆయన పేర్కొన్నారు.జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాలు, సీట్ల విభజన వల్ల తమ ప్రాధాన్యత తగ్గుతుందని ఆందోళన చెందుతున్న తరుణంలో ప్రధాని ఇచ్చిన హామీ ఎంతో కీలకమని లోకేశ్ అభిప్రాయపడ్డారు. ఎన్డీయే ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తికి కట్టుబడి ఉందనడానికి ప్రధాని మాటలే నిదర్శనమని కొనియాడారు. ఏ రాష్ట్రం కూడా నష్టపోకుండా అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నదే కూటమి ఉద్దేశమని స్పష్టం చేశారు. "ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదు.. ఇది ఎన్డీయే గ్యారెంటీ" అంటూ లోకేశ్ ఎక్స్ వేదికగా ధీమా వ్యక్తం చేశారు. సమానత్వమే కూటమి లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## నారా లోకేశ్ ఒక సైనికుడిలా ముందడుగు వేసి, కేడర్‌లో భరోసా నింపారు:

తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టబోతున్న నారా లోకేశ్‌పై రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రశంసల వర్షం కురిపించారు. పార్టీ అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో లోకేశ్ ఒక సైనికుడిలా ముందడుగు వేసి కేడర్‌లో భరోసా నింపారని ఆయన కొనియాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా, యువగళం పాదయాత్రలో అనేక ఆంక్షలు ఎదురైనా రాష్ట్ర ప్రజల కోసం లోకేశ్ వెనకడుగు వేయకుండా పోరాడారని మంత్రి గుర్తుచేశారు. ఒంగోలులో నిర్వహించిన మహానాడు విజయవంతం కావడం వెనుక లోకేశ్ సమర్థవంతమైన సమన్వయం ఉందని పేర్కొన్నారు.టీడీపీని కోటి మంది సభ్యత్వం కలిగిన శక్తివంతమైన ప్రాంతీయ పార్టీగా తీర్చిదిద్దిన ఘనత లోకేశ్‌దేనని ఆయన చెప్పారు. ముఖ్యంగా కార్యకర్తల కోసం 'కార్యకర్తల సంక్షేమ నిధి'ని ఏర్పాటు చేయడం, వారికి ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించడం వంటి విప్లవాత్మక నిర్ణయాలను ఆయన ప్రస్తావించారు. ఒకవైపు పార్టీ బాధ్యతలు నిర్వహిస్తూనే, మరోవైపు మంత్రిగా రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంలో లోకేశ్ అహర్నిశలు శ్రమిస్తున్నారని మంత్రి ప్రశంసించారు. విద్యా విధానంలోనూ ఆయన అనేక సంస్కరణలు తీసుకువచ్చి నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. కష్టపడే కార్యకర్తలకు గుర్తింపునిస్తూ, ఆధునిక ఆలోచనలతో పార్టీని నడిపిస్తున్న లోకేశ్ నాయకత్వం రాష్ట్రానికి, పార్టీకి కొండంత అండ అని గొట్టిపాటి రవికుమార్ అభిప్రాయపడ్డారు.

## హుగ్గేల్లి సిద్దుల గుట్టకు ఆధ్యాత్మిక వైభవం

### - ఈనెల 27, 28, 29 తేదీల్లో మహోత్సవాలు- గోడపత్రిక ఆవిష్కరించిన అవధూత గిరి మహారాజ్

ఝరాసంగం/జహీరాబాద్:
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం హుగ్గేల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సిద్దుల గుట్ట సిద్దేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో స్వామివారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రికలు, కరపత్రాలను గురువారం ఝరాసంగం మండలం బర్దిపూర్‌లోని దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో పీఠాధిపతి అవధూత గిరి మహారాజ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. హుగ్గేల్లి గ్రామానికి ఆధ్యాత్మిక శోభను చేకూర్చేలా స్వామివారి ప్రతిష్ఠాపన కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేస్తున్నామని తెలిపారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, భక్తుల



కోసం అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.స్వామివారి ఆశీస్సులు పొందేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో రాజయోగ ఆశ్రమ పీఠాధిపతి రాచయ్య స్వామి, హుగ్గేల్లి గ్రామ సర్పంచ్ పట్లోల విమల శ్రీనివాస్ రెడ్డి, ఎస్‌బీ రాములు, ఉత్సవ కమిటీ సభ్యులు ఎంజీ మానయ్య, పుట్టి అశోక్, హైదరాబాద్ కిష్టారెడ్డి, అలాగే వైదిక పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉన్నత విద్యలో ఫేస్ అటెండెన్స్‌పై మంత్రి లోకేష్ సమీక్ష

రాష్ట్రంలోని ఉన్నత విద్యాసంస్థల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ముఖ ఆధారిత హాజరు (ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్) విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉన్నత విద్యలో మరింత పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు ఆయన స్పష్టం చేశారు.ఉండవల్లిలోని తన నివాసంలో ఉన్నత విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు అన్‌ఎయిడెడ్ డిగ్రీ, ఇంజనీరింగ్ తదితర కాలేజీల వివరాలను, వాటిలో పనిచేస్తున్న సిబ్బంది, చదువుతున్న విద్యార్థుల ఫేస్ రికగ్నిషన్ కోసం ఇప్పటివరకు చేపట్టిన చర్యల గురించి ఆయన ఆరా తీశారు.ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యా బోధన అందించేందుకు ముఖ ఆధారిత హాజరు విధానం ఎంతగానో దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ విధానం అమలులో ఎలాంటి లోపాలకు తావులేకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, ఉన్నత విద్యా కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి సమీక్ష సమావేశం

నాగల్ గిద్ధ న్యూస్
నాగల్ గిద్ధ మండల కేంద్రంలోని రైతు భవనంలో ఎంపిడిఓ కులకర్ణి మహేష్ రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన"ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి సమీక్షా సమావేశంలో నాగల్ గిద్ధ మండల పరిధిలోని అన్నీ గ్రామాల సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, అలాగే విద్యుత్, అగ్రికల్చర్, ఆర్.డబ్ల్యూ.ఎస్, విద్య, ఐకేపీ, పశు వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎంపిడిఓ కులకర్ణి మహేష్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రజలకు ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుపేద కుటుంబాలకు మేలు చేకూరేలా ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను ప్రజలందరికీ చేరువ చేయడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేసి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించారు.ఈ మండల స్థాయి అధికారులు, వివిధ గ్రామాల సర్పంచ్లు,పంచాయతీ కార్యదర్శులు,మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు



## ఘనంగా రిపోర్టర్ ప్రతాప్ జన్మదిన వేడుకలు

నారాయణఖేడ్, ఏప్రిల్ 16:
మున్సిపల్ పట్టణ పరిధిలోని కాక ఎలక్ట్రానిక్ షాప్‌లో రిపోర్టర్ ప్రతాప్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, శాలువా కప్పి ప్రతాప్‌ను ఘనంగా సన్మానించారు. హాజరైన వారు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మీడియా జేఏసీ నారాయణఖేడ్ అధ్యక్షులు అమృతం, సైద్, మజార్ ఖాన్, వడ్ల రమేష్, వజిత్, నిస్సార్, సునీల్, అంబదాస్, చోటు మియా తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ కార్మికులకు సంపూర్ణ మద్దతు




జహీరాబాద్
జహీరాబాద్ పట్టణంలో తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ చేపట్టిన సమ్మె కు భారతీయ జనతా పార్టీ పూర్తిగా మద్దతు తెలపడం జరిగింది సమ్మెను ఉద్దేశించి జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబా జగన్నాథ్ మాట్లాడుతూ తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ చేపట్టిన సమ్మె కు భారతీయ జనతా పార్టీ జహీరాబాద్ అసెంబ్లీ తరపున సంపూర్ణ మద్దతు తెలపడం జరిగింది. ఈ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత విద్యుత్ ఆర్టిసన్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తానని చెప్పి ఇప్పుడు మోసం చేయడం జరుగుతుంది. వారి యొక్క డిమాండ్ల అయినా విద్య అర్హతల ఆధారంగా ఆర్టిసన్ ఉద్యోగుల కన్వర్షన్ చేయాలి, రెగ్యులర్ ఉద్యోగుల లాగా వారికి కూడా రెగ్యులర్ చేసి సమాన అవకాశాలు ఇవ్వాలని, సవతి తల్లి ప్రేమల చూపించరాదని వారు అన్నారుఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు పూల సంతోష్, సీనియర్ నాయకులు సుదీర్ బండారి, కౌన్సిలర్లు బొగ్గుల సంతోష్, అప్పం శ్రావణ్, వివిధ మండల అధ్యక్షులు వైద్యనాథ్, మల్లేష్, బంటు విశ్వనాథ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

## అక్రమాలకు పాల్పడుతున్న డాక్టర్ ఎడవెల్లి సంతోష్ కుమార్ పై తగు చర్యలు తీసుకోవాలి

### -చేర్యాల సిపిఎం నాయకుల డిమాండ్

చేర్యాల,ఏప్రిల్17(
సిద్ధిపేట జిల్లా చేర్యాల పట్టణ కేంద్రంలోనీ సిపిఎం కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం ఏర్పాటు చేశారు.ఈ సమావేశం సిపిఎం చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు అధ్యక్షతనలో జరగగా సమావేశంలో వెంకట్ మావో మాట్లాడుతూ డాక్టర్ ఎడవెల్లి సంతోష్ కుమార్ చేర్యాల,జనగామ జిల్లా ప్రాంతంలో ఉన్న సుమారు 40 మంది కి పైగా తన అనుచరులను ఏర్పాటు చేసుకొని కాంగ్రెస్ పార్టీ నాయకుడి అండ దండలు ఉన్నాయని చెప్పుకుంటూ గ్రామాల మీద పడి విచ్చలవిడిగా లక్షలాది రూపాయలు వసూలు చేశాడన్నారు.ఇతను దేవరుప్పుల లో కూడా అక్రమ వసూళ్ళు చేస్తే అక్కడి పోలీసులు కేసులు కూడా పెట్టారని,సిద్ధిపేట జిల్లా చేర్యాల,కొమురవెల్లి,మద్దూరు,దుల్మిట్ట తదితర మండలాలలో ఆర్ఎంపి,పిఎంపి డాక్టర్ల పై దౌర్జన్యం చేస్తూ వారిని బెదిరిస్తూ డబ్బులు వసూలు చేశాడన్నారు.చేర్యాల అక్షర హాస్పిటల్ కు ఎలాంటి అనుమతులు లేకుండానే,లైసెన్స్ లు తీసుకోకుండానే హాస్పిటల్ ను నడుపుతున్నాడని ఆయన ఆరోపించారు.డాక్టర్ ఎడవెల్లి సంతోష్ కుమార్ నకిలీ సర్టిఫికెట్లని వెరిఫికేషన్ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను వెంకట్ మావో కోరారు.ఇతనిపై గతంలో చేర్యాల,కొమురవెల్లి పోలీస్ స్టేషన్ లలో పిర్యాదులు కూడా ఉన్నాయని వీటిని మరొక్కసారి పరిశీలించాలని కోరారు.ఇలాంటీ నకిలీ సర్టిఫికెట్లతో వైద్యం చేస్తున్న నకిలీ డాక్టరు ముసుగులో అక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరారు.ఎలాంటి అనుమతులు లేకుండా,నకిలీ సర్టిఫికెట్లతో వైద్యం చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న నకిలీ డాక్టరు ఎడవెల్లి సంతోష్ కుమార్ పై సంబంధిత శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలనీ,లేనిచో సిపిఎం పార్టీ అధ్వర్యంలో ప్రజలందరినీ ఏకం చేసి ఉద్యమాలు నిర్వహిస్తామని ఆయన




హెచ్చరించారు.ఈ సమావేశంలో సిపిఎం చేర్యాల మండల కార్యదర్శి బండకింది అరుణ్,పోలోజు శ్రీహరి,తేలు ఇస్తారి,అముదాల రంజిత్ రెడ్డి,తుప్పతి రాజు,బియ్య సిద్ధులు,కత్తుల నర్సింహారెడ్డి,తదితరులు పాల్గొన్నారు

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
శుక్రవారం
17 ఏప్రిల్ 2026

# వికలాంగుల చెంతకు వీరయ్య -2 ప్రోగ్రామ్

మేడ్చల్ -మల్కాజ్ గిరి జిల్లా కాప్రా లో ఈ రోజు ప్రారంభించడం జరిగింది

వికలాంగుల చెంతకు వెళ్ళాలి, సమస్యలు వినాలి వాటిని పరిష్కారం చేయాలి, వికలాంగుల వద్దకే ప్రజా పాలన రావాలి అనే ఆలోచన తో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగింది

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో వికలాంగుల వద్దకే చైర్మన్ వెళ్లి గ్రీవెన్స్ లు నిర్వహించడం అనేది ఇదే మొదటిసారి

ముతినేని వీరయ్య గారి ఆధ్వర్యంలో వికలాంగుల ప్రత్యేక గ్రీవెన్స్

**ముఖ్యాంశాలు:**

ప్రజాపాలనలో భాగం: వికలాంగుల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా 100 ప్రాంతాల్లో ఇటువంటి గ్రీవెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ßgÔáT] dÔÇ LsAD:

ఈ కార్యక్రమంలో సుమారు 96 మంది వికలాంగులు తమ సమస్యలపై దరఖాస్తులు చేసుకున్నారు. చైర్మన్ గారు ప్రతి ఒక్కరి సమస్యను సావధానంగా విని, అర్హులైన వారి దరఖాస్తులను తక్షణమే అధికారులకు ఫార్వార్డ్ చేశారు.

ప్రధాన విన్నపాలు: వికలాంగులు ప్రధానంగా డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, పెన్షన్లు, వైద్య సహాయం మరియు ఇతర మౌలిక సదుపాయాల గురించి విన్నవించారు.

ప్రభుత్వ పథకాలు - రిజర్వేషన్లు:

వికలాంగుల ఆత్మ బంధువు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు వికలాంగుల పక్షపాతి అని కొనియాడుతూ, ప్రభుత్వం కల్పిస్తున్న పలు ప్రయోజనాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు:

కళ్యాణ లక్ష్మి: ఇద్దరు వికలాంగులు వివాహం చేసుకుంటే కళ్యాణ లక్ష్మితో పాటు అదనంగా 2 లక్షల రూపాయల ప్రోత్సాహకం.

రిజర్వేషన్లు: ఇళ్ల స్థలాల కేటాయింపులో 5% రిజర్వేషన్.

కోర్టు ఉద్యోగాలలో 4% రిజర్వేషన్.

ఉన్నత విద్యలో 5% రిజర్వేషన్.

రాజీవ్ వికాసం పథకంలో 5% రిజర్వేషన్.

క్రీడలు: వికలాంగ క్రీడాకారుల కోసం ప్రత్యేక 'పారా స్పోర్ట్స్ పాలసీ' అమలు.

ఉపకరణాలు : 40% పైన వైకల్యం ఉన్న వారికి అవసరమైన సహాయక ఉపకరణాల పంపిణీ.

పాల్గొన్న ముఖ్యులు:



ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి, డిప్యూటీ కమిషనర్, కప్రా పి ఓ సిడిపిఓ అల్వాల్ బి ఆర్ బి కో-ఆర్డినేటర్, సూపర్వైజర్లు, ఆశా వర్కర్లు మరియు ఎన్ పి ఆర్ డిరాష్ట్ర అధ్యక్షులు కె. వెంకట్ గారు, టి వి హెచ్ ఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుత్తికొండ కిరణ్ గారు తదితరులు పాల్గొన్నారు.

ముగింపు: వికలాంగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, వారిని ఆర్థికంగా మరియు సామాజికంగా ఆదుకుంటామని చైర్మన్ గారు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.



# చైర్మన్ ఎన్నికల వివాదం న్యాయపోరాటానికి బీఆర్ఎస్ సిద్ధం

### -కోర్టు ఆదేశాలతో ఇబ్రహీంపట్నం పిఎస్ లో బీఆర్ఎస్ నేతల హాజరు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 16:-

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం:మున్సిపాలిటీలో ఇటీవల జరిగిన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల సమయంలో కౌన్సిలర్ ఆకుల యాదగిరిని కిడ్నాప్ చేశారనే ఆరోపణలతో తమపై కేసులు నమోదు చేయడం పూర్తిగా తప్పుడు చర్య అని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు.

ఈ కేసు హైకోర్టు పరిధిలో విచారణలో ఉండటంతో కోర్టు సూచనల ప్రకారం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు స్వచ్ఛందంగా హాజరయ్యారు. బెయిల్ పత్రాలు సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన వారు తమపై నమోదైన కేసులు రాజకీయ ప్రేరేపితమని స్పష్టం చేశారు.మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల మద్దతు బీఆర్ఎస్ వైపే ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రత్యర్థి పార్టీలు చైర్మన్ పదవి దక్కించుకోవాలనే ఉద్దేశంతో కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు.

ఈ క్రమంలో తప్పుడు ఆరోపణలు చేసి కేసులు పెట్టించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు.స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రభావంతో పోలీసులను ఉపయోగించి తమపై కేసులు నమోదు చేశారని వారు విమర్శించారు. అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకోవడం ప్రజల ముందే బయటపడుతోందని అన్నారు.ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ ఉందని, ప్రజలు అభివృద్ధి, సంక్షేమం కోసం తమ పార్టీకి మద్దతు ఇస్తున్నారని తెలిపారు. చైర్మన్ పదవి కూడా ప్రజల ఆశయాలను ప్రతిబింబిస్తూ తమకే దక్కిందని వివరించారు.తమపై గానీ, పార్టీ కార్యకర్తలపై గానీ ఎలాంటి తప్పుడు కేసులు పెట్టినా వెనక్కి తగ్గబోమని, న్యాయపరంగా చివరి వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

ఈ వ్యవహారంపై ప్రజలు గమనిస్తున్నారని, భవిష్యత్‌లో జరిగే ప్రతి ఎన్నికలో కూడా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్‌కే మద్దతు తెలుపుతారని వారు విశ్వాసం వ్యక్తం చేశారు.

# మహేశ్వరం నియోజకవర్గంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 16:-

మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని జల్పల్లి సర్కిల్ ప్రీమియర్ ఫంక్షన్ హాల్‌లో 360 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మిషాదీ ముబారక్ చెక్కులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చెక్కులు స్వీకరించిన లబ్ధిదారులు “తులం బంగారం” హామీ అమలు కాకపోవడంపై ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇచ్చిన హామీలను విస్మరిస్తూ పాలన కొనసాగుతోందని విమర్శించారు. ముఖ్యంగా మహిళలకు సంబంధించిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పాటు “తులం బంగారం” హామీ ఇప్పటికీ అమలు కాలేదని, రెండున్నర సంవత్సరాలు గడిచినా ఒక్కరికీ కూడా అందలేదని అన్నారు.ఇల్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో పారదర్శకత పాటించడం లేదని,



కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. అర్హులైన పేదలను గుర్తించి వారికి ఇళ్లు కేటాయించాలని కోరారు.రాష్ట్రంలో తాగునీటి సమస్య తీవ్రంగా మారిందని పేర్కొంటూ, గతంలో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నీరు అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం వారానికి ఒక్కసారి కూడా నీరు సరఫరా చేయడం లేదని విమర్శించారు. వేసవి దృష్ట్యా



తక్షణమే నీటి సమస్యలు పరిష్కరించి, ట్యాంకర్లను అందుబాటులో ఉంచాలని, మిషన్ భగీరథ నీటిని ప్రతిరోజూ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ఇందిరాదేవి, జల్పల్లి సర్కిల్ జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ వెంకట్రాము, మండల అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యుత్ ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 9వ రోజు నిరవధిక సమ్మె

మెదక్,ఏప్రిల్16

(హైద్రాబాద్ ఎస్టేట్):విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మెదక్ విద్యుత్ డివిజన్ కార్యాలయం ముందు 9వరోజైన గురువారం తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టివిఏఈ జెఏసి) పిలుపు మేరకు ఆర్టిజన్లు నిరవధిక సమ్మె నిర్వహించారు.ఈసందర్భంగా ఆర్టిజన్లకు ఏపిఎస్ఈబి సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలని,2026 పిఆర్ సి,మెడికల్ లీవులు,సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు.గ్రేడ్ చేంజ్,పీస్ రేటు కార్మికులకు,అన్ మ్యాన్ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.పోల్ టు పోల్ కార్మికులకు న్యాయం చేయాలన్నారు. వినియోగదారులకు 24గంటలు నిరంతరాయంగా విద్యుత్ అందిస్తున్నా,తాము మాత్రం చాలీ చాలని జీతాలతో పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం,విద్యుత్ యాజమాన్యం కల్పించుకుని వారికి రావాల్సిన న్యాయ పరమైన అన్ని హక్కులను వెంటనే నెరవేర్చాలని డిమాండ్



చేశారు. ఈకార్యక్రమంలో మహిళా ఆర్టిజన్లు సుమలత, జ్యోతి,ప్రణీత,నాగమణి,జెఏసి నాయకులు జంగం శరత్,పృథ్వీ గౌడ్,ప్రదీప్ గౌడ్, శ్రీశైలం,శ్రీనివాస్,బి.చంద్ర భానప్ప,బి.సంపత్ కుమార్, పాపయ్యోల రమేష్, వై.సంగమేశ్వరరెడ్డి,నాగరాజు, వెంకటచారీ,రాజుగౌడ్, మొగులయ్యా,బుస్ససత్యం గుప్తా,పోలశ్రీనివాస్,రమావత్ హరినాయక్, రమావత్ గోపాల్ నాయక్, రమావత్ పూల్య నాయక్,వై.జైపాల్ రెడ్డి,యూసుఫ్,కిషన్, అశోక్,మోహన్,పరశురామ్,నర్సింలు,సుధాకర్, సాయిలు,యాదగిరి, సూర్యరమేష్,శ్రీనివాస్ రెడ్డి,ప్రభాకర్, గంగారం,ప్రవీణ్,తదితరులు పాల్గొన్నారు. నిరవధిక సమ్మెలో భాగంగా మెదక్ విద్యుత్ డివిజన్ కార్యాలయం ముందు కార్మికులు వంటా వార్పు కార్యక్రమం నిర్వహించి తమ తమ నిరసనను వ్యక్తం చేశారు.

# సరూర్‌నగర్ వి.ఎం. హోమ్ పాఠశాలలో క్రికెట్ కోర్టు ప్రారంభం

### -, విద్యార్థులతో మంత్రికి ముఖాముఖి





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 16:-

రంగారెడ్డి జిల్లా: గురువారం రాష్ట్ర షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ మంత్రి అట్లూరి లక్ష్మణ్ కుమార్ సరూర్‌నగర్‌లోని వి.ఎం. హోమ్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఎన్‌సీసీ విద్యార్థులు గౌరవ వందనంతో మంత్రిని స్వాగతించారు.

పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్రికెట్ కోర్టును మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన ఈ పాఠశాలలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది అంకితభావంతో పనిచేయడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు విద్యారంగంతో పాటు క్రీడారంగంలో కూడా మంచి ఫలితాలు సాధిస్తూ రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందడం సంతోషకరమని తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి విద్యాపరమైన అంశాలు, ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాలలో అందుతున్న వసతులపై మంత్రి వివరాలు తెలుసుకున్నారు. తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీలను పరిశీలించారు.

అనంతరం వి.ఎం. హోమ్ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. భోజన నాణ్యత, మెనూపై సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది సమస్యలను వినిపించగా వాటిపై సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో వి.ఎం. హోమ్ పాఠశాల కార్యదర్శి/డీడీ సోషల్ వెల్ఫేర్ జే రామారావు, ప్రిన్సిపాల్ సి నరసింహారెడ్డి, సూపరింటెండెంట్ లక్ష్మీపార్వతి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు

# ఉత్తరాంధ్రలో ఉత్సాహ జ్వాలలు రగిలించిన రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి కాకినాడ, ఏప్రిల్ 16:

రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పిట్టా వరప్రసాద్ గారి మూడు రోజుల విశాఖపట్నం పర్యటన ఉత్తరాంధ్ర జిల్లాల పార్టీ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఏప్రిల్ 13, 14, 15 తేదీలలో జరిగిన ఈ పర్యటన కేవలం కార్యక్రమాల సమాహారం కాదు అది కార్యకర్తలలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిన ఉద్యమ యాత్రగా మారింది.

రాష్ట్ర అధ్యక్షులతో పాటు ఆయన సతీమణి శ్రీమతి పుష్ప రాగం, కుటుంబ సభ్యులు, పార్టీ ఐటీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు డి. మణికంఠ, స్టేట్ ఆఫీస్ ఇంచార్జ్ పావనకుమార్ పాల్గొనడం ఈ పర్యటనకు ప్రత్యేకతను తెచ్చింది.

ఘన స్వాగతం ఉద్యమానికి నాందిఏప్రిల్ 13 సాయంత్రం విశాఖ చేరుకున్న రాష్ట్ర బృందానికి ఉద్యోగ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు మోహన్ రావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బత్తిన లక్ష్మి, ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షులు డాక్టర్ కే గణపతి, హరిబాబు, జయరాజు మరియు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ స్వాగతం ఉత్తరాంధ్రలో పార్టీ బలాన్ని ప్రతిబింబించింది.

అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొనడంఏప్రిల్ 14 ఉదయం ఎల్ఐసి సెంటర్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నిలువెత్తు విగ్రహానికి పూలమాలలు అర్పించి నివాళులర్పించారు.

అనంతరం స్థానిక పౌర గ్రంథాలయంలో ఎం వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన జయంతి సభలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన చేసిన ప్రసంగం సభకు హాజరైన వారిలో కొత్త చైతన్యాన్ని నింపింది.సభ అనంతరం దాదాపు 20 మంది కొత్త సభ్యులను పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది. ఎం. వరప్రసాద్ గారికి రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నియామక పత్రం అందజేయగా,

మిగిలిన వారికి వారి స్థాయికి అనుగుణంగా పదవులు కేటాయించి నియామక పత్రాలు అందించారు. అందరికీ పార్టీ నీలి కండువాలు కప్పి సత్కరించడం కార్యక్రమానికి గౌరవాన్ని చేకూర్చింది.

ఉత్తరాంధ్రలో పార్టీ విస్తరణపై కీలక చర్చలు

ఏప్రిల్ 15 ఉదయం మూడు జిల్లాల నాయకులతో పార్టీ విస్తరణ, సభ్యత్వం పెంపు, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘ చర్చలు జరిపి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కొత్త సభ్యులకు దిశానిర్దేశం చేశారు.మధ్యాహ్నం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు శ్రీ బొడ్డు కళ్యాణరావు గారి నివాసానికి వెళ్లి పార్టీ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కళ్యాణరావు గారు మాట్లాడుతూ, “మీ నాయకత్వంలో పార్టీ ప్రజలతో మరింత మమేకమై ముందుకు సాగుతోంది. యువతను ప్రోత్సహిస్తూ పార్టీ విస్తరణకు కృషి చేయాలి” అని హితవు పలికారు.ఈ పర్యటన ఉత్తరాంధ్ర జిల్లాల కార్యకర్తలకు అపార ఉత్సాహాన్ని ఇచ్చిందని, ఈ స్ఫూర్తిని మరింత ముందుకు తీసుకెళ్తామని ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షులు కే గణపతి హామీ ఇచ్చారు. ఉద్యోగ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు పి.వి. మోహన్ రావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బత్తిన లక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి హరిబాబు తమ సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు.ఉద్యమానికి వేగం నాయకత్వానికి నిదర్శనండాక్టర్ పిట్టా వరప్రసాద్ గారి ఈ పర్యటన ఉత్తరాంధ్రలో పార్టీకి నూతన దిశను చూపింది. కార్యకర్తల్లో ఉత్తేజం, నాయకుల్లో బాధ్యత, కొత్త సభ్యుల్లో నిబద్ధత పెంపొందిన ఈ పర్యటన పార్టీ విస్తరణకు బలమైన పునాది వేసింది.ఉత్తరాంధ్ర నేలపై రగిలిన ఈ ఉద్యమ జ్వాలలు త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా వ్యాపిస్తాయని కార్యకర్తలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.



హైదరాబాద్ ఎస్టేట్
శుక్రవారం
17 ఏప్రిల్ 2026

# సీబీఎస్ఈ 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో ఆక్స్ ఫర్డ్ గ్రామర్ హై స్కూల్ విద్యార్థులు 100% విజయం

హైదరాబాద్, ఏప్రిల్ 16: ప్రార్థనా మణికొండ నేతృత్వంలో ఆక్స్ ఫర్డ్ గ్రామర్ హై స్కూల్ సీబీఎస్ఈ 10వ తరగతిలో 100% విజయ దుందుభి మ్రోగించి అనూహ్య ఫలితాలు సాధించింది. ఆక్స్ ఫర్డ్ గ్రామర్ హై స్కూల్, హిమాయత్ నగర్ కి చెందిన చీఫ్ ప్యాట్రన్ వేద కుమార్ మణికొండ, డైరెక్టర్ శ్రీమతి ప్రార్థనా మణికొండ నేతృత్వంలో సీబీఎస్ఈ 10వ తరగతి ఫలితాల్లో 100% విజయాన్ని సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. తల్లిదండ్రుల సమక్షంలో ఆనందంగా ఉన్న విద్యార్థులను సత్కరిస్తూ శ్రీమతి ప్రార్థనా మణికొండ మాట్లాడుతూ.. "విజయం అనేది నిరంతర శ్రమ, బలమైన పునాది, మరియు నిరంతర అభ్యాసానికి ప్రతిబింబం. ఇది అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులు, కృషిశీల గల విద్యార్థులు, వారికి సదా సహకరించే తల్లిదండ్రులు మరియు సమర్థవంతమైన విద్యా వ్యూహాల సమన్వయంతో సాధ్యమవుతుందని అన్నారు. ఈ సంవత్సరం 100% ఫలితం ప్రత్యేకమైనది, ఎందకంటే మొత్తం శాతం అత్యంత ఉన్నతంగా ఉండి, అనేక మంది విద్యార్థులు అధిక మార్కుల శ్రేణిలో నిలిచారు. ఈ అద్భుతమైన ఫలితాలు పాఠశాల యొక్క సూత్రపరమైన అవగాహన, నైపుణ్యాభివృద్ధి, క్రమశిక్షణ మరియు సమగ్ర విద్య పట్ల ఉన్న నిబద్ధతనం



ప్రతిబింబిస్తున్నాయి. ఈ విజయాలను క్రమబద్ధమైన పునశ్చరణ ప్రణాళికలు మరియు గణితంలో అదనపు సహాయం అవసరమైన విద్యార్థులకు ఉచిత రెమిడియల్ తరగతుల వంటి ప్రత్యేక చర్యలు మరింత బలోపేతం చేశాయి" అని తెలిపారు.
ఈ అద్భుత విజయానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు యాజమాన్యం కలసి చేసిన కృషి ప్రధాన కారణమని చెప్పారు. ఆమె దూరదృష్టి గల నాయకత్వంలో ఈ విద్యాసంస్థ ప్రగతి మార్గంలో ముందుకు సాగుతూ నిరంతరంగా అభివృద్ధి



చెందంతోంది.
విజయయాత్ర శ్రీమతి ప్రార్థనా మణికొండ నాయకత్వంలో పాఠశాల ఈ విజయయాత్రను కొనసాగిస్తోంది. స్కూల్ కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్, డీన్ రామాంజుల, ప్రిన్సిపల్స్ రేఖ రావు , ఫాతిమా కాజిమ్ లో విద్యార్థులను వారి యొక్క అద్భుత ఫలితాల పై అభినందించారు.

# పూలే ద్విశత జయంతి కమిటీలో ఆర్. కృష్ణయ్యకు స్థానం

### -బీసీ ఉద్యమానికి జాతీయ గౌరవం-మోదీ అధ్యక్షతన కమిటీ ఏర్పాటు
### -దశాబ్దాల పోరాటానికి గుర్తింపు బీసీ సాధికారతకు కొత్త దిశ

హైదరాబాద్, ఎస్టేట్ న్యూస్ ప్రతిదీ హైదరాబాద్ ఏప్రిల్ 16:
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన నిర్వహించబడనున్న మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశత జయంతి ఉత్సవాల జాతీయ కమిటీలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య (టైగర్ ఆర్. కృష్ణన్న) సభ్యునిగా ఎంపిక కావడం విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ ప్రతిష్టాత్మక కమిటీలో మాజీ రాష్ట్రపతులు, మాజీ ప్రధానులు, లోక్‌సభ స్పీకర్‌తో పాటు 34 మంది కేంద్ర మంత్రులు, 25 రాష్ట్రాల ముఖ్యమంత్రులు భాగస్వాములవడం ఈ ఉత్సవాల విస్తృతిని స్పష్టంగా తెలియజేస్తోంది. బీసీ వర్గాల హక్కుల సాధన కోసం దశాబ్దాలుగా నిరంతర పోరాటం సాగించిన ఆర్. కృష్ణయ్యకు ఈ కమిటీలో స్థానం కల్పించడం గౌరవప్రదమైన నిర్ణయమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం పేర్కొన్నారు.
బీసీ ఉద్యమ చరిత్రలో ఆర్. కృష్ణయ్య పోరాటాలు కీలక మలుపు తిప్పాయని ఆయన వివరించారు. దేశంలో ఎక్కడ లేనివిధంగా బీసీ విద్యార్థుల కోసం గురుకుల విద్యాసంస్థలు, బీసీ హాస్టల్స్ ఏర్పాటు చేయించడంలో ఆయన పోరాటం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. గ్రామీణ, పేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు ఈ సంస్థలు పెద్ద ఎత్తున దోహదపడ్డాయని తెలిపారు. అలాగే, బీసీ విద్యార్థులు చదువుకుంటేనే సమాజంలో చైతన్యం పెరిగి, ఆ చైతన్యం వారిని రాజ్యాధికార వైపు దారితీస్తుందనే దృఢ నమ్మకంతో ఆర్. కృష్ణయ్య




ఉద్యమాలను ముందుకు నడిపారని గుజ్జ సత్యం స్పష్టం చేశారు. ఈ దిశగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, కోచింగ్ సదుపాయాలు, హాస్టల్స్ వంటి అనేక సంక్షేమ పథకాలను సాధించడం ఆయన ఉద్యమ విజయాల ప్రతిఫలమని పేర్కొన్నారు. ఈ చర్యలు లక్షలాది బీసీ విద్యార్థుల భవిష్యత్తును మార్చడంతో పాటు, సమాజంలో విద్యా సమానత్వాన్ని బలోపేతం చేశాయని ఆయన అభిప్రాయపడ్డారు.
2028 ఏప్రిల్ 11 వరకు కొనసాగనున్న ఈ కమిటీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పూలే ద్విశత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో, ఆర్. కృష్ణయ్య నాయకత్వంలో ఈ వేడుకలను విజయవంతం చేయాలని గుజ్జ సత్యం పిలుపునిచ్చారు. "బీసీలు విద్యతో చైతన్యవంతులై రాజ్యాధికారంలో భాగస్వాములు కావాలన్న లక్ష్యంతో సాగిన ఉద్యమం నేడు ఫలితాలను ఇస్తోంది. ఈ వేడుకలు ఆ దిశగా మరింత ప్రేరణనిస్తాయి" అని గుజ్జ సత్యం పేర్కొన్నారు.

# తెలంగాణ అస్తిత్వంపై దాడి, తేజస్వీ సూర్య క్షమాపణ చెప్పాలి

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 16:-
రంగారెడ్డి జిల్లా, భారతీయ జనతా పార్టీ ఎంపీ తేజస్వీ సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్‌పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి తీవ్రంగా ఖండించారు. గురువారం విలేఖరులతో మాట్లాడిన ఆయన, ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.
తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం, దేశ అత్యున్నత చట్టసభ అయిన పార్లమెంటులో పూర్తిగా ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా జరిగిన ప్రక్రియ అని ఆయన స్పష్టం చేశారు. అలాంటి చారిత్రక ప్రక్రియను మత ప్రాతిపదికన, రక్తపాతంతో కూడిన దేశ విభజనతో పోల్చడం చారిత్రక అవగాహనలేమికి నిదర్శనం మాత్రమే కాకుండా, భారత రాజ్యాంగాన్ని అవమానించడమేనని మండిపడ్డారు.
దశాబ్దాల పాటు విద్యార్థులు, యువకులు, రైతులు తమ ప్రాణాలను పణంగా పెట్టి సాధించిన ఫలితం తెలంగాణ రాష్ట్రం అని ఆయన గుర్తు చేశారు. ఉద్యమకారుల త్యాగాలను, ప్రజల ఆకాంక్షలను చులకన చేస్తూ మాట్లాడటం ఒక పార్లమెంట్ సభ్యుడి బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రాంతీయ ఆకాంక్షలను గౌరవించడం భారత సమాఖ్య స్ఫూర్తిలో భాగమని, కానీ వాటిని అపహాస్యం చేయడం గర్హనీయం అని అన్నారు.
ఇప్పటికే తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈ అంశంపై స్పందిస్తూ, తెలంగాణ నుంచి ఎన్నికైన బీజేపీ ఎంపీలు తమ మౌనం వీడి స్పందించాలని, తేజస్వీ సూర్యతో క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేసిన విషయాన్ని పాండురంగారెడ్డి గుర్తు చేశారు.
తెలంగాణ సమాజానికి, ఉద్యమకారులకు తేజస్వీ సూర్య వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని, పార్లమెంట్ గౌరవాన్ని తగ్గించేలా చేసిన ఈ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచిన



బీజేపీ ఎంపీలు తమ పార్టీ సహచరుడి వ్యాఖ్యలను ఖండించి, రాష్ట్ర ప్రయోజనాల కోసం నిలబడాలని కోరారు.
తెలంగాణ అస్తిత్వంపై దాడి చేసే ఏ శక్తినైనా ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కొంటామని కప్పాటి పాండురంగారెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు



# రామకృష్ణాపూర్ ప్రెస్ క్లబ్ పాత కమిటీ రద్దు త్వరలో నూతన కార్యవర్గ ఎన్నిక

హైదరాబాద్ ఎస్టేట్ మంచిర్యాల
మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నికకు మార్గం సుగమం చేస్తూ ప్రస్తుతమున్న పాత కమిటీని రద్దు చేస్తున్నట్లు ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు మిట్టపల్లి సంతోష్ కుమార్ వెల్లడించారు. గురువారం ఠాగూర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. పాత కమిటీ ఏర్పడి సంవత్సరం కాలం పూర్తయిన నేపథ్యంలో, నిబంధనల ప్రకారం ఆ కమిటీని రద్దు చేస్తున్నట్లు తెలిపారు. క్లబ్ బలోపేతానికి, జర్నలిస్టుల సంక్షేమానికి కొత్త ఉత్సాహంతో పనిచేసేలా త్వరలోనే పారదర్శకంగా నూతన కమిటీని ఎన్నుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రెస్ క్లబ్ మాజీ జనరల్ సెక్రటరీ ఎరుకల బుచ్చి బాబుతో పాటు సీనియర్ సభ్యులు ఎర్రవెల్లి శ్రీనివాస్, సాయి కుమార్, కూరపాటి శ్రీనివాస్, వేల్పుల కిరణ్, పిల్లి రవికిరణ్, డొలకల సంతోష్ కుమార్, గంజి సతీష్, బద్రి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ముత్యాల శ్యామల భాస్కర్‌కు రామచంద్ర రావు సన్మానం

### -మున్సిపాలిటీలో నూతన నాయకత్వానికి గౌరవ వందనం

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 16
మున్సిపాలిటీలో వైస్ చైర్మన్‌గా ఎన్నుకోబడిన ముత్యాల శ్యామల భాస్కర్‌కు రాష్ట్ర స్థాయిలో విశేష గౌరవం లభించింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు అభినందనలు తెలియజేస్తూ, ఆమెను సన్మానించారు. ప్రజాసేవ పట్ల నిబద్ధత, పట్టుదలతో ముందుకు సాగుతున్న నాయకత్వాన్ని గుర్తిస్తూ ఈ సత్కారం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ, ముత్యాల శ్యామల భాస్కర్ ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా కృషి చేస్తారని రాష్ట్ర అధ్యక్షులు విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడంలో ఆమె చూపుతున్న



చురుకుదనం ప్రశంసనీయం అని పేర్కొన్నారు. స్థానిక అభివృద్ధికి అంకితభావంతో పని చేస్తూ, సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న నాయకత్వం అవసరమని ఈ సందర్భంగా తెలిపారు. ముత్యాల శ్యామల భాస్కర్ కూడా తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రజల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి వర్గానికి న్యాయం చేసే విధంగా, పారదర్శకంగా సేవలందించేందుకు కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు. అభివృద్ధి పథంలో మున్సిపాలిటీని ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం శ్రమిస్తానని తెలిపారు. ఈ సన్మానం మున్సిపాలిటీలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని అభినందనలు తెలిపారు. ప్రజా సేవలో ముందుకు సాగుతున్న నాయకత్వానికి ఇది ప్రోత్సాహకంగా నిలుస్తుందని కార్యక్రమంలో పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ఘన విజయం, నవోదయ, సైనిక్, గురుకుల ప్రవేశాల్లో మెరిసిన నల్లవెల్లి బాలుడు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 16:-
నల్లవెల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థి జంగయ్య జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి నవోదయ, సైనిక్, గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్షల్లో అద్భుత ఫలితాలు సాధించి గ్రామానికి గౌరవం తీసుకొచ్చాడు. సాధారణ కుటుంబానికి చెందిన ఈ విద్యార్థి కష్టపడి చదివి ఈ విజయాన్ని సాధించడం గ్రామస్థులందరికీ ఆనందాన్ని కలిగించింది.



నిరుపేద కుటుంబంలో జన్మించిన జంగయ్య తన ప్రతిభతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా పెద్ద స్థాయిలో రాణించగలరని నిరూపించాడు. ప్రైవేట్ పాఠశాలలతో పోటీ పడుతూ ప్రభుత్వ బడి విద్యార్థుల సత్తాను చాటిచెప్పిన ఈ విజయం అందరికీ ఆదర్శంగా నిలిచింది.
ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, పాఠశాల ఉపాధ్యాయులు కలిసి జంగయ్యను ఘనంగా సన్మానించారు. అతని కృషి, పట్టుదల, గురువుల మార్గదర్శకత్వం వల్లే ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆశీర్వదించారు.
కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రావణ్, ఉపాధ్యాయులు వెంకటయ్య, భాస్కర్ రావు, సంజయ్ కుమార్, ప్రేమ్ కుమార్ మరియు గ్రామస్థులు పాల్గొన్నారు. జంగయ్య సాధించిన ఈ విజయంతో గ్రామంలో విద్యపై మరింత ఆసక్తి పెరిగిందని, ఇతర విద్యార్థులు కూడా ప్రేరణ పొందుతున్నారని ఉపాధ్యాయులు తెలిపారు.

# అక్రమ కట్టడాలపై రెవెన్యూ శాఖ కఠిన చర్యలు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 16:-
అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై రెవెన్యూ శాఖ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు గురువారం గౌరెల్లి , కుంట్లూరు గ్రామాలలో అక్రమంగా నిర్మించబడిన కట్టడాలను తొలగించారు. వివరాల ప్రకారం, గౌరెల్లి గ్రామంలోని సర్వే నంబర్ 206లో ఉన్న ప్రభుత్వ భూమిపై కొందరు వ్యక్తులు




అనధికారికంగా నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించారు. అదే విధంగా కుంట్లూరు గ్రామంలోని సర్వే నంబర్లు 100 మరియు 101లో కూడా అక్రమ కట్టడాలు ఉన్నట్లు రెవెన్యూ సిబ్బంది గుర్తించారు. ఈ నేపథ్యంలో, గౌరెల్లి మరియు కుంట్లూరు గ్రామాల ఊరాలు, రెవెన్యూ సిబ్బంది సమక్షంలో జేసీబీ యంత్రాల సహాయంతో ఆ నిర్మాణాలను కూల్చివేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించేవారిపై ఎలాంటి సహనం చూపబోమని అధికారులు హెచ్చరించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అక్రమ నిర్మాణాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని, ప్రభుత్వ భూములను రక్షించేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

హైదరాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in

శుక్రవారం
17 ఏప్రిల్ 2026

# ప్రజా పాలన కార్యక్రమంలో మహిళల సాధికారతపై దృష్టి

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 16:-
రంగారెడ్డి జిల్లా మహిళలందరూ అక్షరాస్యులుగా అభివృద్ధి చెందాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ దివ్య దేవరాజ్ పేర్కొన్నారు. 99 రోజుల ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం ఫరూక్‌నగర్ మండల కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో కమిషనర్ దివ్య దేవరాజ్, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలనతో పాటు రాష్ట్ర గీతంతో మండల సభ ప్రారంభమైంది. ఎంపీడీవో ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. అనంతరం మండలంలో ఏర్పాటు చేసిన వివిధ శాఖల స్టాల్స్‌ను కమిషనర్, కలెక్టర్, ఎమ్మెల్యే సందర్శించారు.

మండల స్థాయి అధికారులు తమ శాఖల పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాలపై సమగ్ర వివరాలు అందించారు. రైతు రుణ మాఫీ, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, కొత్త రేషన్ కార్డులు, పాస్‌బుక్స్, సన్న బియ్యం పంపిణీ, వైద్య సేవలు వంటి పథకాల అమలు వివరాలు ప్రజలకు తెలియజేశారు. అలాగే ముఖ్యమంత్రి అల్పాహారం పథకం, ఇందిరమ్మ జీవిత కుటుంబ బీమా, మధ్యాహ్న భోజన పథకం ఇంటర్మీడియట్‌కు విస్తరణ, ప్రతిభావంతులైన విద్యార్థులకు మోటారు వాహనాలు, పంటల వైవిధ్యం, సహజ సేంద్రీయ వ్యవసాయం వంటి కొత్త పథకాలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా దివ్య దేవరాజ్ మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రాష్ట్రంలోని 558 మండలాల్లో



మహిళలను బస్సుల యజమానులుగా మార్చినట్లు వివరించారు. బస్సుల కొనుగోలు, నిర్వహణలో ఖర్చు అధికంగా ఉండటంతో మహిళలకు బాధ్యతలు అప్పగించి ఉపాధి అవకాశాలను పెంచుతున్నట్లు తెలిపారు. అలాగే సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు కూడా మహిళలకు కేటాయిస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాల భవనాల నిర్మాణాన్ని పెద్ద ఎత్తున చేపట్టి మూడు నెలల్లో 8000 భవనాలు నిర్మించేందుకు చర్యలు ప్రారంభించామని పేర్కొన్నారు. గ్రామీణ అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని, 15వ ఆర్థిక సంఘం నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రజలు హెల్మెట్, సీటు బెల్ట్ వినియోగంపై దృష్టి పెట్టాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం వంటి చర్యలను నివారించాలని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా



పూర్తి చేయడానికి చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరేలా అందరూ కృషి చేయాలని సూచించారు. జిల్లాలో 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చివరి దశలో ఉందని, త్వరలో పూర్తిచేస్తామని తెలిపారు. గ్రామీణ అభివృద్ధి సమస్యలపై తక్షణ స్పందన అందిస్తున్నట్లు వెల్లడించారు.

అనంతరం కళ్యాణ లక్ష్మి చెక్కులు, అంగన్వాడీ విద్యార్థులకు యూనిఫాంలు, దివ్యాంగులకు ట్రై సైకిళు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్, డిపిఓ సురేష్ మోహన్, పిడి డి.ఆర్.డి.ఏ శ్రీలత, డిసిపి శిరీష, ఆర్డీవో సరిత, ఎంపీడీవో బన్సీలాల్, ఏసిపి లక్ష్మీనారాయణ, తహసీల్దార్ నాగయ్య, సర్పంచులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లాలో వైద్య శాఖ 99 రోజుల ప్రగతి కార్యక్రమం విజయవంతం

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 16:-
రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం"లో భాగంగా జిల్లాలో ఆరోగ్య సేవలను మరింత విస్తరించే దిశగా కీలక కార్యక్రమాలు చేపట్టారు. మార్చి 6 నుండి 31 వరకు జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నిపుణుల వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు సమగ్ర వైద్య సేవలు అందించారు. ఈ శిబిరాలలో ప్రసూతి, గర్భిణీ సంరక్షణ, శిశు వైద్యం, కంటి చికిత్స, ఎముకల వైద్యం, దంత వైద్యం, సాధారణ వైద్యం నిపుణులు సేవలందించారు. మొత్తం 12,677 మంది రోగులు వైద్య సేవలు పొందగా, 2,610 మంది గర్భిణీలకు ముందస్తు పరీక్షలు నిర్వహించారు. వీరిలో 81 మందిని అధిక ప్రమాద గర్భిణీలుగా గుర్తించగా, 15 మందిలో తీవ్రమైన రక్తహీనత ఉన్నట్లు గుర్తించారు. అదేవిధంగా 618 పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించారు. అసంక్రమిక వ్యాధుల నియంత్రణలో భాగంగా ఏప్రిల్ 1 నుండి 15 వరకు ప్రత్యేక శిబిరాలు కొనసాగుతున్నాయి. అధిక రక్తపోటు, మధుమేహం పరీక్షలలో 11,816 మందికి పరీక్షలు నిర్వహించగా, రక్తపోటుతో బాధపడుతున్న 1,774 మందిని, మధుమేహంతో బాధపడుతున్న 897 మందిని చికిత్సలోకి తీసుకున్నారు.

క్షయవ్యాధి నిర్మూలన లక్ష్యంగా మార్చి 24 నుండి ప్రత్యేక స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో 3,750 మందికి పరీక్షలు చేయగా, 675 మందికి ఛాతీ ఎక్స్‌రేలు తీసి 26 మంది బాధితులను గుర్తించారు. ఈ కార్యక్రమం ఇంకా కొనసాగుతోంది.

99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 6 నుండి 11 వరకు ఆరోగ్య వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. భాస్కర్ వైద్య కళాశాలలో ఆహార భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించగా, ఎలిమినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సురక్షిత తల్లి దినోత్సవం నిర్వహించారు. దుర్గం చెరువు కేబుల్ వంతెనపై ఎయిడ్స్ అవగాహన రన్ నిర్వహించి ప్రజల్లో చైతన్యం కల్పించారు.

కొండాపూర్ జిల్లా ఆసుపత్రిలో 100 పడకల ట్రామా సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభించగా, గచ్చిబౌలి స్టేడియంలో 2,000 మందితో యోగా ప్రదర్శన నిర్వహించారు. మహేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రిలో మద్యపానం, మత్తు పదార్థాల వ్యసన నివారణ



కేంద్రాన్ని ప్రారంభించారు. అదే రోజు ఔషధ నియంత్రణ బలోపేత కార్యక్రమాలు నిర్వహించి నాణ్యమైన మందుల సరఫరాపై దృష్టి సారించారు.

ఇతరంగా కీటక జనిత వ్యాధుల నియంత్రణ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సదుపాయాల మెరుగుదల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి వైద్య కళాశాలలకు రిఫరల్ వ్యవస్థ బలోపేతం వంటి చర్యలను చేపట్టినట్లు జిల్లా వైద్య & ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ స్థాయిలోనే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో జిల్లా వైద్య శాఖ కీలక ముందడుగు వేసిందని పేర్కొన్నారు.

# సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన




విజయనగరం:
జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం సమావేశ మందిరమందు యూనిసెఫ్ సహకారంతో సికిల్ సెల్ ఎనీమియా (రక్తహీనతపై) వైద్యాధికారులు/కమ్యూనిటీ హెల్త్ అఫ్ఫిసర్స్ కు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేచర్ యూనిసెఫ్ యువజన ఆరోగ్యం , సికిల్ సెల్ రక్తహీనత కార్యక్రమంలో భాగంగా, నేచర్ సంస్థ 2026 ఏప్రిల్ 16న విజయనగరం జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి ఒకరోజు అవగాహన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో సికిల్ సెల్ రక్తహీనతకు సంబంధించిన నిర్ధారణ విధానాలు, స్క్రీనింగ్‌లో ఎదురవుతున్న సవాళ్లు, తాజా వైద్య అభివృద్ధులు మరియు భవిష్యత్ కార్యాచరణపై విశదంగా చర్చించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వైద్యాధికారులు మరియు కమ్యూనిటీ హెల్త్ అఫ్ఫిసర్స్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ శిక్షణలో మొత్తం 58 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమానికి నిపుణులైన వనరుల వ్యక్తులు మార్గనిర్దేశం చేశారు. అందులో సలీమా భాటియా (యునిసెఫ్ ఎక్సర్ట్), కె. రాణి గారు (డి ఎల్ ఓ, విజయనగరం), డా. అనిల్ గారు (జనరల్ మెడిసిన్, కేజిహెచ్), డా. విక్రాంత్ వర్మ గారు (పాథాలజీ) తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సికిల్ సెల్ ఎనీమియా (రక్తహీనత)ను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఆరోగ్య సేవలందించే వారి సామర్థ్యం గణనీయంగా పెరిగింది. దీని ద్వారా జిల్లాలో ఆరోగ్య ఫలితాలు మెరుగుపడే అవకాశాలు ఉన్నాయి. ఈ కార్యక్రమాన్ని నేచర్ బృందం సభ్యులు ఎస్. అనీష్, ఎం. ప్రసాద్, చైతన్య, రామకృష్ణ సమన్వయం చేసి విజయవంతంగా నిర్వహించారు.



# కొండాపూర్ ప్రభుత్వాసుపత్రిపై ఆకస్మిక తనిఖీ, సేవల మెరుగుపరచాలని ఆదేశాలు



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 16:-
రంగారెడ్డి జిల్లా కొండాపూర్ ప్రభుత్వాసుపత్రిని ఆరోగ్య శాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను, ప్రత్యేకంగా తెలంగాణ డయాగ్నస్టిక్ పరిధిలో నిర్వహిస్తున్న పరీక్షలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు.

పరీక్షలు సకాలంలో నిర్వహించి, రోగులకు నిర్దిష్ట సమయంలోనే రిపోర్టులు అందించాలని వైద్యులకు సూచించారు. మొత్తం 134 రకాల వైద్య పరీక్షలు ప్రజలకు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాతా-శిశు సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచిస్తూ, ప్రతి గర్భిణీని ఎంసిహెచ్ పోర్టల్‌లో నమోదు చేసి, వారికి నిరంతర వైద్య పర్యవేక్షణ కల్పించాలని పేర్కొన్నారు. జిల్లాలో పెరుగుతున్న అసంక్రమిత వ్యాధులు అయిన రక్తపోటు, మధుమేహం బాధితులకు సరైన మందులు అందిస్తూ, క్రమం తప్పకుండా ఫాలోఅప్ నిర్వహించాలని వైద్యులకు ఆదేశించారు. వికలాంగులకు ఆసుపత్రుల్లో సౌకర్యాలు మెరుగుపరచాలని సూచిస్తూ, ర్యాంపులు, రైలింగ్‌లు, వీల్‌చైర్లు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. అలాగే వర్షపు నీటి సంరక్షణ కోసం ఇంకుడు గుంతలు, రేన్‌వాటర్ హార్వెస్టింగ్ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బస్తీ దవఖానాల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని సూచించారు. అదేవిధంగా కొండాపూర్‌లో నిర్మాణంలో ఉన్న గ్రామకేర్ సెంటర్‌ను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని తెలిపారు.

జిల్లాలోని కనీసం 30 శాతం ఆసుపత్రులు జాతీయ నాణ్యతా ప్రమాణాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ అనురాగిణి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రకృష్ణ, జిల్లా ప్రోగ్రాం అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# నంది వనపర్తి, గ్రామపంచాయతీ కార్యాలయంలో దివ్యాంగుడి ఆత్మహత్యాయత్నం

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 16:-



రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నందివనపర్తి గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఇంటి స్థలం వివాదంతో మనస్థాపానికి గురైన ఓ దివ్యాంగుడు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన దివ్యాంగుడు తనకు చెందిన ఇంటి స్థలాన్ని కొందరు వ్యక్తులు కబ్జా చేసి నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించాడు. ఈ విషయమై రెండో నెల క్రితమే గ్రామ సర్పంచ్, కార్యదర్శికి ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో తీవ్ర నిరాశకు గురై ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లిన అతను అక్కడే ఆత్మహత్యాయత్నం చేయడం స్థానికంగా కలకలం రేపింది. వెంటనే అప్రమత్తమైన స్థానికులు అతన్ని అడ్డుకుని, చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై బాధితుడి తల్లి తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, తమ సమస్యను పరిష్కరించాలని అధికారులను వేడుకుంది. "మా ఇంటి స్థలాన్ని కాపాడాలని ఎన్నిసార్లు కోరినా ఎవరూ పట్టించుకోలేదు. నా కుమారుడు ఈ పరిస్థితికి చేరుకోవడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణం" అంటూ కన్నీరుమున్నీరైంది. ఇక గ్రామస్థులు కూడా ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి చర్యలు తీసుకుని ఉంటే ఇలాంటి పరిస్థితి ఏర్పడేదే కాదని అంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# జిల్లా కలెక్టర్ స్వీయ గణన పూర్తి

## - ప్రజలందరూ స్వీయ గణన చేసుకోవాలని పిలుపు

**విజయనగరం:**
భారత ప్రభుత్వం చేపట్టిన జనగణన2027 కార్యక్రమంలో భాగంగా అందుబాటులో ఉన్న స్వీయ గణన ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి గురువారం స్వయంగా పూర్తి చేసి, జిల్లా ప్రజలందరు స్వీయ గణన చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికతను వినియోగించి ప్రజలు సులభంగా తమ వివరాలను నమోదు చేసుకునే విధంగా ప్రభుత్వం ఈ స్వీయ గణన సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని వినియోగించుకొని, ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని కోరారు. ప్రజలు అధికారిక వెబ్‌సైట్ ద్వారా మొబైల్ నంబర్‌తో లాగిన్ అయి, ఓ టి పి ద్వారా ధృవీకరణ పూర్తి చేసి, తమ కుటుంబ సభ్యుల వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. నమోదు చేసే సమయంలో ఎటువంటి తప్పులు లేకుండా సరైన సమాచారం ఇవ్వడం అత్యంత ముఖ్యమని తెలిపారు. స్వీయ గణన ప్రక్రియలో ఇబ్బందులు ఎదురైతే సమీప సచివాలయ సిబ్బంది లేదా గణన సిబ్బందిని సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. అలాగే, డేటా గోప్యతకు పూర్తి భద్రత కల్పించబడుతుందని ప్రజలు నమ్మకంగా పాల్గొనాలని అన్నారు. జిల్లాలోని ప్రతి ఒక్కరూ స్వీయ గణనలో భాగస్వాములు కావాలని, ప్రభుత్వ కార్యక్రమం విజయవంతం చేయడంలో సహకరించాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి కోరారు.

# విద్యాసంస్థలకు సమీపంలో పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు

**- జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్**

**- విద్యాసంస్థలకు 100మీటర్ల పరిధిలో సిగరెట్లు, ఖైనీలు వంటి పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించిన జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్**

**- ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్' పేరుతో విద్యాసంస్థల సమీపంలోని పాన్ షాపులు, కిరాణ షాపుల్లో తనిఖీలకు ఆదేశించిన జిల్లా ఎస్పీ**

**- స్పెషల్ తనిఖీలలో 347కేసులు నమోదు చేసి, రూ.52,250 జరిమానాను కోట్పా చట్టం క్రింద విధించామన్న జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్**

ం - విజయనగరం:
జిల్లాలో విద్యాసంస్థలకు సమీపంలోని పాన్ షాపులు, కిరాణా షాపుల్లో సిగరెట్స్, నిషేధిత ఖైనీ, గుట్కాలు, మత్తు కలిగించే ఇతర పొగాకు వస్తువులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఏప్రిల్ 16న హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ - 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్' పేరుతో స్థానిక పోలీసులు, ఈగల్, ఎస్బీ పోలీసులు సంయుక్తంగా విద్యాసంస్థలకు 100మీటర్ల పరిధిలో పాన్ షాపులు, కిరణా షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించామన్నారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తం గా విద్యాసంస్థలకు సమీపంలోని పాన్ షాపులు, కిరాణ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టామన్నారు. ఈ ప్రత్యేక డ్రైవులో భాగంగా విద్యాసంస్థలకు 100మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తులను విక్రయించిన 347మంది వ్యాపారులపై కోట్పా చట్టం (ది సిగరెట్స్ అండ్ అదర్ టొబాకో ప్రొడక్ట్స్ 2003 చట్టం) ప్రకారం కేసులు నమోదు చేసి, వారికి రూ.52,250/-లను జరిమానాగా విధించామన్నారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా పొగాకు ఉత్పత్తులు వలన కలిగే అనర్థాలను తగ్గించేందుకు, విక్రయాలు, ప్రచారం, బహిరంగ ప్రదేశాల్లో ధూమపానంను నియంత్రించుటకు కోట్పా చట్టంను 2003లో భారత ప్రభుత్వం అమలులోకి తీసుకొని వచ్చిందన్నారు. విద్యాలయాలకు దగ్గరలో ఉన్న పాన్ షాపులు, కిరాణ షాపుల్లో పొగాకు ఉత్పత్తులను విక్రయించడం వలన విద్యార్థులు వీటిని వినియోగించేందుకు అలవాటుపడి, చెడు మార్గంలో ప్రయాణించే అవకాశం ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పొగాకు ఉత్పత్తులను విక్రయించకుండా చర్యలు చేపట్టేందుకు వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని, పొగాకు ఉత్పత్తుల విక్రయాలకు స్వస్తి పలకాలని జిల్లా ఎస్పీ



కోరారు. ఈ తరహా దాడులు భవిష్యత్తులో మరింత విస్తృతం చేస్తామని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ స్పష్టం చేసారు.జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషను పరిధిలో చేపట్టిన ప్రత్యేక డ్రైవ్ లో సంబంధిత సిఐలు, ఎస్ఐలు పాల్గొనగా, సంబంధిత డిఎస్పీలు ఈ స్పెషల్ డ్రైవును పర్యవేక్షించారు.

# చిరుతిళ్లు, సెల్ ఫోన్లతో పిల్లల ఆరోగ్యానికి ముప్పు

**-ఎంఎల్ హెచ్ ఓ భాగ్యలక్ష్మి హెచ్చరిక**

- నెల్లిమర్ల :
చిన్న పిల్లల ఆహారపు అలవాట్లు, జీవనశైలి పట్ల తల్లిదండ్రులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఎంఎల్ హెచ్ ఓ భాగ్యలక్ష్మి సూచించారు. గురువారం మండలంలోని కొండగుంపాం సచివాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మహిళలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ
జంక్ ఫుడ్ పట్ల జాగ్రత్త
పిల్లలకు బయట దొరికే చిరుతిళ్లు, ముఖ్యంగా కుర్ కురీలు, ఇతర జంక్ ఫుడ్స్ అలవాటు చేయడం వల్ల వారి ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుందని భాగ్యలక్ష్మి హెచ్చరించారు.
వీటిలో ఉండే రసాయనాలు, అధిక ఉప్పు పిల్లల ఎదుగుదలపై ప్రభావం చూపుతాయి. చిన్న వయసులోనే ఊబకాయం, జీర్ణక్రియ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.
వీటిని పూర్తిగా నివారించి, పోషక విలువలున్న ఇంటి ఆహారాన్ని అందించాలని కోరారు.
నేటి కాలంలో పిల్లలు సెల్ ఫోన్లకు బానిసలుగా మారడం పట్ల ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఆండ్రాయిడ్ ఫోన్ల నుండి వెలువడే రేడియేషన్ వల్ల పిల్లలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది. నిరంతరం ఫోన్ చూడటం వల్ల మెదడు చురుకుదనం తగ్గుతుందని, ఇది వారి జ్ఞాపకశక్తిని దెబ్బతీస్తుందని వివరించారు. ఏకాగ్రత లోపించడం వల్ల పిల్లలు చదువులో వెనుకబడే అవకాశం ఉందని, కాబట్టి పిల్లలను ఫోన్లకు వీలైనంత దూరంగా ఉంచాలని తల్లిదండ్రులకు సూచించారు. అవగాహన సదస్సులో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొని మహిళలకు తగిన సూచనలు చేశారు. అంగన్వాడీలు మొయిద పైడిరాజు, రెడ్డి రాజు, పతివాడ గౌరి



గరుగుబిల్లి ఆదిలక్ష్మి,
రుంకాన సత్యవతి
పిల్లల భవిష్యత్తు దృష్ట్యా తల్లిదండ్రులు వారిని క్రమశిక్షణతో కూడిన ఆరోగ్యకరమైన జీవనశైలి వైపు నడిపించాలని సూచించారు

# గంజాయి వినియోగంపై కఠిన చర్యలు

**- నెల్లిమర్ల ఎస్ఐ గణేష్ హెచ్చరిక**

నెల్లిమర్ల :
మండలంలో గంజాయి ఆనవాళ్లు లేకుండా చేయడమే లక్ష్యమని, గంజాయి వినియోగాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించేది లేదని నెల్లిమర్ల ఎస్ఐ గణేష్ స్పష్టం చేశారు. గంజాయి రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు, యువత సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.
యువత భవిష్యత్తును నాశనం చేసుకుకోవద్దన్నారు. గంజాయి వల్ల కలిగే అనర్థాలను వివరించారు:
గతంలో గంజాయి సేవిస్తూ పట్టుబడిన విద్యార్థులు ఇప్పుడు కేసుల్లో ఇరుక్కుని, కోర్టుల చుట్టూ తిరుగుతూ తమ విలువైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
గంజాయి మనిషిని శారీరకంగా, సామాజికంగా, ఆర్థికంగా దిగజార్చుతుందని.. చివరికి ప్రాణాల మీదకు తెస్తుందని హెచ్చరించారు. గంజాయి
సేవించినా
నిల్వ ఉంచినా
రవాణా చేసినా
వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. యువత ఇటువంటి వ్యసనాలకు దూరంగా ఉండి, ఉన్నత లక్ష్యాల వైపు పయనించాలని కోరారు. గంజాయికి సంబంధించి ఎటువంటి సమాచారం ఉన్నా ప్రజలు వెంటనే స్పందించాలని ఎస్ఐ కోరారు. సమాచారం ఉన్న వారు 9121109444 నంబర్‌కు ఫోన్ ద్వారా లేదా వాట్సాప్ మెసేజ్ ద్వారా తెలియజేయవచ్చు. సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని ఆయన భరోసా ఇచ్చారు



# బెల్టు షాపు నిర్వాహకులపై బైండోవర్ కేసులు

- పూసపాటిరేగ: మండలం తహసిల్దార్ ఎన్ వి రమణ వద్ద పూసపాటిరేగ మండలానికి చెందిన గతంలో బెల్ట్ షాపులు నిర్వహించి కేసులు నమోదైన 12 మంది వ్యక్తులను గురువారం హాజరుపరిచారు.వీరికి అండర్ సెక్షన్ 129 ఆఫ్ బి ఎన్ ఎస్ ఎస్ యాక్ట్ 2023 ప్రకారం మరలా బెల్ట్ షాపులు నిర్వహించి కేసులు నమోదైనచో లక్ష రూపాయల అపరాధ రుసుము చెల్లించుట లేదా జైలు శిక్ష అంగీకారంపై బైండోవర్ నమోదు చేశారు.

# గ్యాస్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

పులివెందుల ఏప్రిల్ 16
గురువారం పులివెందులలోని జయమ్మ కాలనీలో అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. గ్యాస్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖ అధికారి సునీల్ కుమార్ రెడ్డి మహిళలకు సూచించారు. గ్యాస్ లీక్ అవుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే రెగ్యులేటర్లను ఆఫ్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అగ్నిమాపక సహాయ అధికారి రవీంద్రారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# న్యాయమూర్తుల ఆకస్మిక తనిఖీ

కడప ఏప్రిల్ 16
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు, కడప డి.ఎల్.ఎస్.ఏ. చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని సూచనలతో, డి.ఎల్.ఎస్.ఏ. సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ కడప నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని, ప్రభుత్వ పరిశీలన గృహాన్ని సందర్శించారు. అక్కడ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి, మౌలిక సదుపాయాలు, వంటశాల, వసతి గదులు, టాయిలెట్లను పరిశీలించారు. విద్య విలువైనదని, క్రమశిక్షణతో అభ్యసించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు.

# ముద్దనూరులో బస్టాండు, జంతు వధశాల వేలం రద్దు

ముద్దనూరు, ఏప్రిల్ 16: ముద్దనూరు పట్టణంలోని పంచాయతీ కార్యాలయంలో ఏప్రిల్ 15, బుధవారం నిర్వహించిన బస్టాండు మరియు జంతు వధశాల వేలంపాటను అనివార్య కారణాల వల్ల రద్దు చేసినట్లు ఈవో నరసింహులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరిగి ఈ వేలంపాటను రేపు ఏప్రిల్ 17, శుక్రవారం - మధ్యాహ్నం 12 గంటలకు స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల వ్యక్తులు, వ్యాపారులు నిర్ణీత సమయానికి హాజరై వేలంపాటలో పాల్గొనవలసిందిగా కోరారు. వేలంపాటలో పాల్గొనే వారు అవసరమైన డిపాజిట్ మొత్తాన్ని, సంబంధిత పత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు. అలాగే, పంచాయతీ నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాలు పాటిస్తూ మాత్రమే వేలంపాట జరుగుతుందని ఈవో నరసింహులు తెలిపారు

# రాష్ట్ర అభివృద్ధికి జగన్ అడ్డు

జమ్మలమడుగు , ఏప్రిల్ 16:- జమ్మలమడుగులో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరంలో ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధికి ఆటంకంగా మారిన జగన్పై తీవ్ర విమర్శలు చేశారు. జగన్ రాష్ట్రానికి ఓ కలుపు మొక్కని విమర్శించారు. అమరావతి రాజధాని నిర్మాణం కేంద్ర సహకారంతో వేగంగా జరుగుతోందని తెలిపారు. ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు

# రోడ్డు ప్రమాదం.. వ్యక్తి మృతి

చాపాడు ఏప్రిల్ 16
కడప జిల్లా చాపాడు మండలం పల్లవోలు సమీపంలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మైదుకూరుకు చెందిన యల్లాల కొండయ్య యాదవ్ (59) మృతి చెందారు. పని నిమిత్తం ప్రొద్దుటూరు వెళ్తుండగా, వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





